# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం



## త్యాగరాజు

### (1968 ఆగష్టు, విజయచిత్ర సంచిక నుంచీ పునర్ముద్రణ)

1961లో వాల్తేరులో అంతర్ కళాశాల నాటకపోటీ జరిగింది. అందులో ముప్పై అయిదు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆ నాటక పోటీలో త్యాగరాజుకు ఉత్తమ సహాయ నటుడి బహుమతి లభించింది.

త్యాగరాజుకు నటనలో ఆసక్తి కలగడం చిత్రంగా జరిగింది. సికింద్రాబాదులో హైస్కూల్లో చదువుతూ వుండగా ఒక నాటకంలో వాళ్ళ మాస్టారి బలవంతం మీద నటించవలసి వచ్చింది. నాటకంలో అతను ధరించింది స్త్రీ పాత్ర. ఒక ఘట్టంలో భోరున ఏడవాలి. అసలే భయంతో

స్టేజిమీదకు వచ్చిన అతను ఆ ఘట్టంలో నిజంగానే ఏడిచేశాడు.

ప్రేక్షకులు మాత్రం అదంతా నటనేననుకుని కరతాళధ్వనులు చేశారు. తెరపడింది. ఆ నాటకాన్ని అప్పటి హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు కూడా చూశారు. ఆయన అతని నటనను మెచ్చుకుని అతనికి ఒక రజిత పాత్రను బహూకరించారు. అలా తను నటించిన మొదటి నాటకంలోనే బహుమతి రావడంతో త్యాగరాజుకు నటనలో నిజమైన ఆసక్తి కలిగింది. ఆ తరవాత అతను స్కూలు నాటకాలలో విరివిగా పాల్గొన్నాడు. స్కూలు చదువు ముగించుకుని తమ సొంత వూరైన వరంగల్‌లో బి.ఏలో చేరాడు. కాలేజీలో జేరిన తరవాత అతనికి నాటకాలమీద ఉత్సాహం అధికమైంది.

త్యాగరాజు హైదరాబాదులో బి.ఏ ముగించుకుని యం.ఏ.లో చేరాడు. నైట్ కాలేజీలో చేరి బి.యల్. కూడా చదవసాగాడు.

త్యాగరాజు అక్కయ్య, బావా సింగపూర్‌లో వున్నారు. వాళ్ళమ్మగారిని సింగపూర్ పంపడానికి త్యాగరాజు మద్రాసు వచ్చాడు ఒకసారి. సంగీత దర్శకులు టి.చలపతిరావుగారి బంధువులొకరు త్యాగరాజుకు స్నేహితులు. మద్రాసు వచ్చిన త్యాగరాజును ఆయన చలపతిరావుగారికి పరిచయం చేశారు. చలపతిరావుగారు అప్పుడు 'మంచిమనిషి' చిత్రాన్ని మరొకరితో కలిసి తీసే ప్రయత్నంలో వున్నారు. ఆయన ఆ చిత్ర దర్శకులైన ప్రత్యగాత్మకు త్యాగరాజును చూపించారు. త్యాగరాజు పర్సనాలిటీని చూసి, ఆయన, ఆ చిత్రంలో తప్పకుండా అవకాశం ఇస్తానని అతనికి హామీ యిచ్చారు.

సినిమా ఛాన్సు వచ్చింది. ఒక ప్రఖ్యాత దర్శకుడి దర్శకత్వంలో అందులోనూ తన అభిమాన నటుడైన రామారావుగారి పక్కన. అతను తన అదృష్టాన్ని తలుచుకుని మురిసిపోయాడు.

షూటింగ్‌కు హాజరు కావడం ఆరంభించాడు. అయితే అతనిమీద చిత్రీకరించిన మొదటి దృశ్యాలన్నీ నిశ్శబ్ద దృశ్యాలు. సంభాషణలు లేనివి. అందుచేత అతను కెమెరా అంటే భయపడలేదు. నిజంగా సంభాషణల చిత్రీకరణ వచ్చేసరికి అతను కెమెరాకు అలవాటు పడిపోయాడు.

'మంచి మనిషి' చిత్రం పూర్తయింది. విడుదలయింది. అయితే తనకు వెనువెంటనే యాభైయ్యో డెబ్భైరెండో అవకాశాలు వచ్చెయ్యలేదని, అతను నీరసపడ్డాడు. తిరిగి చదువుకోడానికి హైదరాబాదు ప్రయాణం అయ్యాడు. నిరుత్సాహపడ్డ త్యాగరాజులో తిరిగి ప్రత్యగాత్మగారు ఉత్సాహాన్ని పోశారు. వెళ్ళిపోవద్దనీ మద్రాసులోనే వుంటే మరో రెండు మూడేళ్ళలోనైనా మంచి అవకాశాలు వస్తాయనీ బోధించారు. త్యాగరాజు ప్రయాణాన్ని మానుకున్నాడు.

ఆ తరవాత 'పల్నాటియుద్ధం' చిత్రంలో వీరభద్రుడి పాత్రకు ఒడ్డూ పొడుగూ వున్న ఒక వ్యక్తి కావలసివచ్చాడు. ఆ పాత్రకు రామినీడుగారు త్యాగరాజును ఎన్నుకున్నారు. ఆ తరవాత రామానాయుడుగారిని కలవగా వారి ప్రతిజ్ఞాపాలన చిత్రంలో ఒక వేషం ఇచ్చారు.

రంగుల రాట్నంలో బి.యన్.రెడ్డిగారు అంతవరకూ అతను నటించిన పాత్రలకు విభిన్నమైన పాత్రను త్యాగరాజుకు ఇచ్చారు. త్యాగరాజు అంతవరకూ చేసినవి అవో తరహా పాత్రలు. 'రంగుల రాట్నం'లోనిది కరుణరస ప్రధానమైన పాత్ర. ఆ పాత్రతో త్యాగరాజుకు మంచి పేరొచ్చింది. అతను ఈ తరహా పాత్రలనూ నటించగలడు అని పదిమందికీ తెలిసింది.

ఆ తరువాత విఠలాచార్యగారు చిక్కడూ దొరకడు చిత్రంలో ఓ మంచిపాత్రను ఇచ్చారు. నటుడిగా త్యాగరాజుకు మంచి పేరును తెచ్చినది 'పాపకోసం' చిత్రం. ప్రతిజ్ఞాపాలన చిత్రంలో వున్న పరిచయంతో ధైర్యంగా త్యాగరాజుకు ఆ పాత్రను ఇచ్చారు రామానాయుడుగారు. ఆ చిత్రంతో త్యాగరాజుకు ప్రేక్షకులలోనూ మంచి గుర్తింపు వచ్చింది. అతన్ని అభినందిస్తూ మెచ్చుకుంటూ ఎన్నో ఉత్తరాలు వచ్చాయి.

ఇటీవల త్యాగరాజుకు యల్.వి.ప్రసాద్‌గారు నిర్మించే 'రాజా అవుర్ రంక్' హిందీ వర్ణ చిత్రంలో కూడా అవకాశం కలిగించారు దర్శకులు ప్రత్యగాత్మ. అలా త్యాగరాజును మొదటిసారిగా తెలుగు తెరకు, హిందీ తెరకూ కూడా పరిచయం చేసింది ఆయనే.

త్యాగరాజు ఇప్పుడు బంగారు పంజరం, ఎవరు మొనగాడు, పార్వతీశపథం, అందంకోసం పందెం, జీవితబంధం, జన్మభూమి, మాధవి. బి.ఆర్. ఫిల్మ్స్, నవయుగ చిత్ర, రాగమంజరి, సంస్థల చిత్రాలలోనూ నటిస్తున్నాడు.

త్యాగరాజుకు తమిళ హిందీ నాటకాలను కూడా ప్రదర్శించాడు. అతనికి నాటకాలలో నటించడం అంటే ఎంతో ఇష్టం. అందుకనే ఇటీవల ప్రభాకరరెడ్డితో కలిసి ఆంధ్రాలో అనేకచోట్ల నాటక ప్రదర్శనలిచ్చాడు.

"నేను 'మంచి మనిషి' చిత్రంతో చిత్రసీమలో ప్రవేశించాను. రంగులరాట్నం చిత్రంతో నిలబడ్డాను. పాపకోసం చిత్రంతో స్థిరపడ్డాను. నన్ను ప్రత్యగాత్మ, బి.యన్.రెడ్డి, విఠలాచార్య, రామానాయుడుగార్లు ప్రోత్సహించారు. నటుడిగా నిలబడడానికి తోడ్పడ్డారు. పరిశ్రమలోని ఇతరులు కూడా నాకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ తోడ్పడ్డారు. వారందరి మేలూ నేనెన్నటికీ మరువలేను. ముందు ముందు వివిధ తరహాల భూమికలు ధరించాలన్నది నా ఆశ.. నా ఆశ పేరాశ కాదనుకుంటాను. నటనలో మరింత కృషి చేసి మంచి నటుడు అనిపించుకోవాలన్నది నా ఆశయం. అందుకు ముఖ్యంగా కావలసింది ప్రేక్షకుల ఆదరాభిమానాలూ, నిర్మాత దర్శకుల ప్రోత్సాహమూ. ఇవి రెండూ వుంటే నేను సాధించగలనన్న నమ్మకం నాకున్నది" అన్నాడు త్యాగరాజు.

Post your comments